క్లుప్తంగా

బీసీ వసతి భవనం ప్రారంభం



డైనింగ్ హాల్‌ను పరిశీలిస్తున్న డీడీ కుష్బూకొఠారి

ఉరవకొండ: స్థానిక అంబేడ్కర్ నగర్‌లో ఉరగాద్రి మాదిగల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పునఃనిర్మించిన భవనంలో బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ భవనాన్ని గురువారం బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి ప్రారంభించారు. డీడీ మాట్లాడుతూ ఎస్సీ కమ్యూనిటీ పాత భవనాన్ని సంక్షేమ సంఘం నాయకులు అన్ని వసతులతో తీర్చిదిద్దారన్నారు. రెసిడెన్షియల్ భవనంలో ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ బీసీ విద్యార్థులకు వసతి కల్పిస్తామన్నారు. విశ్రాంత సీడీపీఓ రామాంజనమ్మ మాట్లాడుతూ ప్రతి నెలా మాదిగల సంక్షేమ సంఘ సభ్యుల సహకారంతో వసతి గృహాన్ని పూర్తి చేశామన్నారు. అనంతరం డీడీ విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు.

కొలతల్లో అక్రమాలను అరికట్టండి

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని వ్యాపార దుకాణాల్లో సరుకుల కొలతల్లో అక్రమాలను అరికట్టాలని జైభీమ్ సంరక్షణ సమితి సభ్యులు విన్నవించారు. స్థానిక కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో గురువారం తూనికలు, కొలతలు శాఖ అధికారి మహమ్మద్ గౌస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జైభీమ్ సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు విలియమ్స్, రాష్ట్ర అధ్యక్షులు రాజు, దొడగట్ట రామదాసు పాల్గొన్నారు.

సర్మస్ హుసేనీ దర్గాలో ఫాతేహాలు



అలంకరణలో స్వామి సమాధి

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు సర్మస్ హుసేనీ స్వామి దర్గాలో గురువారం భక్తులు దర్గాలో ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతేహాలు, ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గా ఆవరణలో కందూరీలు చేశారు.

'నీట్' ఫలితాల్లో ప్రతిభ



సాయిసూర్య గణేష్

రాయదుర్గంటౌన్: ఎంబీబీఎస్ ప్రవేశానికి నీట్(ఎన్ఈఈటీ) యూజీ–2023 పరీక్ష ఫలితాల్లో పట్టణానికి చెందిన రేకులకుంట సాయి సూర్యగణేష్ ప్రతిభ కనబరిచాడు. పట్టణంలోని ప్రముఖ స్వీట్ మర్చంట్స్ రేకులకుంట సత్యనారాయణ(లడ్డు), అనిత దంపతుల తనయుడు 654/720 మార్కులతో జాతీయస్థాయిలో 6,053వ ర్యాంకు, జనరల్ కేటగిరిలో 3,164వ ర్యాంకు సాధించాడు.

బాలిక అదృశ్యం



దీపిక

గుమ్మఘట్ట: మండలంలోని గొల్లపల్లికి చెందిన నాగరాజు, ఇందిరమ్మ కుమార్తె దీపిక (17) గత 8 వ తేదీ నుంచి కనిపించడం లేదని తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కర్ణాటకలోని కొండ్లపల్లిలో దీపిక ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కళాశాలలకు సెలవులు వదలడంతో రెండు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చింది. ఈ నెల 8న తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లారు. అదేరోజు సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి కూతురు కనిపించకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికినా కనిపించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీ ఉద్యోగుల సేవలు ఆదర్శనీయం



ప్రతిభ చూపిన ఉద్యోగులకు నగదు పురస్కారాలు అందిస్తున్న డిప్యూటీ సీఎంఈ

ఉరవకొండ: పట్టణంలోని ఆర్టీసీ డిపోను లాభాల బాట పట్టించిన ఉద్యోగుల సేవలు అందరికీ ఆదర్శమని ఆర్టీసీ డిప్యూటీ సీఎంఈ మోహన్‌కుమార్ తెలిపారు. గురువారం ఉరవకొండ డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభకు సీఎంఈ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 2023, మే నెలకు డిపోలో అత్యుత్తమ ప్రతిభ చూపిన డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బందికి ప్రశంసాపత్రంతో పాటు నగదు అందించారు. సన్మానం పొందిన వారిలో ఆర్టీసీ ఉద్యోగులు జయసింహ, గంగాధర్, రామచంద్రరెడ్డి, అంబకుమార్, వెంకటేసులు, నాగరాజు, శ్రీనివాసులు, అమీర్‌సాబ్, ప్రసాద్, వాహబ్‌వలి ఉన్నారు. కార్యక్రమంలో డీఎం బాలాజీ దయాళ్, సిబ్బంది ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ విద్యావ్యవస్థ దేశానికే రోల్ మోడల్

- 'అనంత ఆణిముత్యాలు' పురస్కార సభలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



ఉరవకొండ: విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



విడపనకల్లు: హావళిగిలో వృద్ధురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: రాష్ట్రంలో కొనసాగుతున్న విద్యావ్యవస్థ దేశానికే రోల్ మోడల్ అని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలు అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం నియోజకవర్గ స్థాయి అనంత ఆణిముత్యాల ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవ సభ పండుగ వాతావరణం మధ్య నిర్వహించారు. వజ్రకరూరు మండల విద్యాశాఖ అధికారి ఎర్రిస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకున్నాయన్నారు. గతంలో ప్రైవేట్ పాఠశాలల్లో పోటీ పడి అడ్మిషన్లు చేయించే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. నేడు ప్రభుత్వ పాఠశాలలో వద్ద నో అడ్మిషన్స్ బోర్డులు కన్పించడం ఎంతో గొప్ప విషయన్నారు. అనంతరం 2022–23లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు పవన్‌కుమార్, సాయిగోపాల్‌నాయక్, శశాంక్, యాసిన్‌తాజ్‌తోపాటు ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన దేవి, స్రవంతి, పూజిత, వహిదకు నగదు పురస్కారాలతో పాటు జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, మండల ప్రత్యేక అధికారి, ఏడీఏ పద్మజ, ఎంపీపీ చంద్రమ్మ, సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు ఏసీ పార్వతమ్మ, ఎంపీడీఓ చంద్రమౌళి, ప్రిన్సిపాళ్లు మమత, ప్రశస్తకుమారి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం

విడపనకల్లు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధిలో దేశంలో ఏపీని టాప్‌లో నిపారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని హావళిగిలో సచివాలయం–2 పరిధిలోని, పెద్దమ్మ గుడి కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒక్క హావళిగి గ్రామానికి నాలుగేళ్లలో జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా దాదాపు రూ.140 కోట్లు మంజూరు చేశారన్నారు. గతంలో ప్రభుత్వం నుంచి ఏమైనా లబ్ధి పొందాలంటే ఎంతో మంది దగ్గరకు వెళ్లి ప్రాధేయపడినా పేదలకు అందేవి కాదని, జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పేదల కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యేతో కలిసి మహిళా సంఘాల సభ్యులు సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్ పరిపాలనలో జరుగుతున్న అభివృద్ధి చూడలేక కేంద్రంలో అధికార బీజేపీ, రాష్ట్రంలో ప్రతిపక్ష టీడీపీ దిగుజారుడు రాజకీయాలు చేస్తున్నాయన్నారు. సీఎం జగన్‌ను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. 2024లో వైఎస్సార్‌సీపీ గెలుపును ఆపడం ఎవరి తరం కాదన్నారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు హనుమంతు, ఎంపీపీ కరణం పుష్పావతి, జేసీఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, సర్పంచు గీతమ్మ, ఎంపీటీసీలు రాజమ్మ, కళావతి, విడపనకల్లు, పెద్ద కొట్టాలపల్లి సొసైటీ చైర్మన్లు బోయ శ్రీరాములు, నరేంద్రరెడ్డి, ఎస్సీసెల్ జిల్లా నాయకుడు బండారు సుంకన్న, నాయకులు కరణం భీంరెడ్డి, మేకల రామాంజనేయులు, రఘురాములు, బసాపురం ఆంజనేయులు, వడ్డే మడకశిర, తిప్పయ్య, భీంరావు, హంపయ్య, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దారు ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు భూమిపూజ

విడపనకల్లు మండల పరిధిలోని హావళిగి గ్రామంలో గురువారం మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి తాగునీటి పైపులైన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. పంచాయతీ నిధులు రు.6లక్షల వ్యయంతో ఎస్సీ కాలనీ నుంచి పెద్దమ్మ గుడి కాలనీ వరకూ దాదాపు 500 మీటర్లు తాగునీటి పైపులైన్ నిర్మాణం చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ధనుంజయ తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

తక్షణసాయం అందజేత

బ్రహ్మసముద్రం: మండలంలోని పిల్లలపల్లిలో వడ్డే తిమ్మప్ప(40) ఇటీవల గుండె పోటుతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది వైఎస్సార్ బీమా కింద రూ.10 వేలు తక్షణసాయం అందించారు. మిగిలిన రూ.90 వేలు నామిని బ్యాంకు ఖాతాలో జమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ తలారి గోవిందప్ప, మాజీ సర్పంచ్ వడ్డే వెంకటేశులు, మాజీ డీలర్ హనుమంతరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కవిత, వెల్ఫేర్ అసిస్టెంట్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: పట్టణంలోని 23వ వార్డుకు చెందిన హరికృష్ణ (30) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ అర్చన, ఎంపీపీ మారుతమ్మ, సచివాలయ సిబ్బంది వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద రూ.10 వేలు అందజేశారు. మిగిలిన మొత్తం నామినీ హాసిని బ్యాంకు ఖాతాకు జమవుతుందన్నారు. కాగా అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రాయదుర్గంటౌన్: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్ల యూనియన్ డిమాండ్ చేసింది. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున ఆధ్వర్యంలో మేరి, రాధ, శోభారాణి, ఉలిగమ్మ తదితర అంగన్‌వాడీ టీచర్లు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీడీపీఓ ప్రభావతికి గురువారం అందజేశారు. తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని, హెల్పర్ల ప్రమోషన్లకు వయో పరిమితి 50 ఏళ్లకు పెంచాలని వారు కోరారు.

అనుమతి లేకుండా బార్ నిర్వహించొద్దు



బార్ నిర్వాహకులకు నోటీసు అందిస్తున్న ఈఓ, పాలకవర్గ సభ్యులు

ఉరవకొండ: మేజర్ పంచాయతీ నుంచి అనుమతులు లేకుండా బార్ అండ్ రెస్టారెంట్ ఎలా నిర్వహిస్తారంటూ ఈఓ గౌస్‌సాహెబ్, ఉపసర్పంచ్ వన్నప్ప, వార్డు సభ్యుడు బార్ నిర్వాహకులను నిలదీశారు. గురువారం గుంతకల్లు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన భవాని బార్ అండ్ రెస్టారెంట్‌కు ఈఓతో పాటు పాలకవర్గ సభ్యులు, వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు తదితరులు వెళ్లారు. ఈసందర్భంగా బార్ నిర్వాహకులు రమేష్‌నాయుడుకు ఈఓ పలు సూచనలు చేశారు. కేవలం రెస్టారెంట్ నిర్వహణకు మాత్రమే అనుమతి ఉందని, బార్ నిర్వహించాలంటే పంచాయతీ పాలకవర్గ ఆమోదం తీసుకోవాలన్నారు. ఏడు రోజుల్లో నోటీసుకు వివరణ ఇవ్వాలన్నారు. కాగా బార్ నిర్వాహకుడు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అన్నీ అనుమతులు పొందిన తర్వాతే బార్ ప్రారంభించామని తెలిపారు.

శుద్ధ జలంతో రోగాలు దూరం



తాగునీటిని పరిశీలిస్తున్న జిల్లా ఆహార భద్రత అధికారి రామచంద్ర

బొమ్మనహాళ్: శుద్ధ జలంతో రోగాలు దూరమవుతాయని జిల్లా ఆహార భద్రత అధికారి రామచంద్ర అన్నారు. మండలంలోని బొల్లనగుడ్డం గ్రామంలో ఆయన పర్యటించి తాగునీటిని పరిశీలించారు. అనంతరం తాగునీటి శాంపుల్ సేకరించారు. ఆయన మాట్లాడుతూ జీఎస్ఎల్ఆర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరచి, క్లోరినేషన్ చేయాలన్నారు. క్లోరినేషన్ చేసిన అనంతరం నీటిని ట్యాంకులో నింపాలన్నారు. ట్యాంకు పరిమాణాన్ని బట్టి క్లోరిన్ ద్రావణాన్ని నీటిలో కలపాలన్నారు. పైప్‌లైన్ల లీకేజీలు లేకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి రఫీయా సుల్తానా, పీహెచ్ఎన్ సుశీలమ్మ, సర్పంచ్ గాదిలింగ, వైద్య సిబ్బంది గోవర్ధన, భార్గవి, సుధాకర్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అతిసారంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న రాకెట్ల పీహెచ్‌సీ సిబ్బంది

ఉరవకొండ: మండలంలోని నెరిమెట్ల గ్రామంలో అతిసారం పక్షోత్సవాల్లో భాగంగా గురువారం జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థుల ఆధ్వర్యంలో రాకెట్ల పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ర్యాలీ చేపట్టారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండీ షఫీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ స్వచ్ఛమైన నీరు తాగాలన్నారు. కలుషిత నీరు తాగితే అనారోగ్యం పాలవుతారన్నారు. అతిసారం ప్రబలితే ఇబ్బందులు పడుతారని హెచ్చరించారు. పీహెచ్‌సీల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లలిత, సీఓ భగవాన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో వ్యర్థాలను తొలగించండి



కాలువలో చెత్త వేస్తున్న పారిశుధ్య సిబ్బంది

బొమ్మనహాళ్: మండల కేంద్రం బొమ్మనహాళ్‌లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని కోళ్ల వ్యర్థాలు, చెత్తా చెదారాన్ని పంచాయతీ పారిశుధ్య సిబ్బంది తీసుకొచ్చి ప్రధాన కాలువల్లో వేస్తున్నారన్నారు. వ్యర్థాలు వేడయం వల్ల కాలువ పూడిపోయి వర్షాలు వచ్చినప్పుడు ఇళ్లలోకి నీరు చేరుతోందన్నారు. ఇంటింటా సేకరించిన, రోడ్లపై ఉన్న చెత్తా చెదారాన్ని చెత్త సంపద తయారీ కేంద్రంలో వేయాల్సిన పంచాయతీ పారిశుధ్య సిబ్బంది వంకలు, కాలువల్లో వేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగు పరచి, కాలువల్లో వేస్తున్న వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఈఓపీఆర్‌డీ విజయమ్మను వివరణ కోరగా వ్యర్థాలను కాలువల్లో వేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని గోళ్ల గ్రామం వద్ద త్రుటిలో ప్రమాదం తప్పింది. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు కారులో అనంతపురం బయలుదేరాడు. గోళ్ల వద్దకు వెళ్లగానే ముందు వైపు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేయబోయి పక్కనే ఉన్న మట్టి గుట్టను ఢీ కొన్నాడు. ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదు.

సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం

వజ్రకరూరు: మండల కేంద్రంలోని మూడో వార్డు(బలిజవీధి)లో సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. రోడ్లు అధ్వానంగా ఉండటంతో రాకపోకలు సాగించడానికి వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో స్థానిక వార్డు సభ్యుడు మధుసూదన్ సమస్యను సర్పంచు మోనాలిసా, ఉపసర్పంచు మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పంచాయతీ నిధులు మంజూరు చేయించారు.

మహిళపై దాడి

రాయదుర్గం రూరల్: బహిర్భూమికి వెళ్లిన బోయ శివమ్మ అనే మహిళపై చాకలి రాజా అనే యువకుడు దాడి చేసిన సంఘటన మండలంలోని ఆయతపల్లిలో గురువారం చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ బాబు వివరాల మేరకు.. బోయ శివమ్మ తన ఫోన్ రిసీవ్ చేయలేదని ఆ యువకుడు కట్టెతో దాడి చేసి గాయపరిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

శరవేగంగా జగనన్న ఇళ్ల నిర్మాణం



జి.వెంకటంపల్లి సమీపంలో ఇళ్ల నిర్మాణాలకు పునాదులు తవ్వుతున్న లబ్ధిదారులు

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో జగనన్న ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులు పునాదుల నిర్మించుకుంటున్నారు. మండలానికి మొదటి విడతలో 320 గృహాలు మంజూరయ్యాయి. జగనన్న లేఅవుట్లలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, రోడ్లు తదితర మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. పనులు చేసిన వెంటనే బిల్లులు అందిస్తామని హౌసింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తత ప్రచారం చేసి లబ్ధిదారులను చైతన్యపరుస్తున్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

బెళుగుప్ప: మండలంలోని నక్కలపల్లి సచివాలయ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటలకు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామచంద్ర, ఎంపీపీ పెద్దన్న, జెడ్పీటీసీ సభ్యురాలు మమత, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప, సర్పంచ్ రామిరెడ్డి, ఎంపీటీసీ వరలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరు కావాలన్నారు.

17,18న రైల్వే గేటు మూసివేత

బీటీపీ రోడ్డు(రాయదుర్గంటౌన్): రాయదుర్గం–బీటీపీ రోడ్డుమార్గంలో ఉన్న రైల్వే గేటును ఈ నెల 17, 18 తేదీల్లో రెండు రోజుల పాటు మూసివేయనున్నట్లు నైరుతీ రైల్వే మైసూరు డివిజన్ మొలకాల్మూరు విభాగం సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రాకేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైల్వే మెయింటెనెన్స్‌కు సంబంధించి అత్యవసర ఓపెనింగ్, పని తనిఖీ నిమిత్తం గేటు మూసి వేస్తామన్నారు. వాహన రాకపోకలకు ప్రత్యామ్నాయంగా రెండురోజుల పాటు ప్రయాణికులు, వాహనచోదకులు రాయదుర్గం–గొల్లపల్లి రోడ్డుమార్గం లేదా రాయదుర్గం– అడిగుప్ప రోడ్డు మార్గాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులు, పోలీసులకు తెలియశామన్నారు. గేటు మూసివేస్తున్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని మల్లికార్జునపల్లి వద్ద బుధవారం అర్ధరాత్రి బైకు అదుపు తప్పి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు...కంబదూరు మండలం పాళ్లూరుకు చెందిన జయరాం పని నిమిత్తం బైకులో గుండ్లపల్లికి బయలుదేరాడు. మల్లికార్జునపల్లి వద్ద బైకు అదుపు తప్పి కిందపడ్డాడు. ఘటనలో జయరాంకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వచ్చిన వాహనదారులు 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురం తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'రజకులు అన్నింటా రాణించాలి'

బొమ్మనహాళ్: రజకులు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఆ సంఘం కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న సూచించారు. గురువారం మండలంలోని కల్‌హోళ గ్రామంలో ఆయన పర్యటించారు. ముందుగా షాబాజ్ దీవాన్ వలీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రజకులంతా ఒక తాటిపై నడిచి ప్రభుత్వం నుంచి రావాల్సిన హక్కులను రాబట్టుకుందామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారు. రజకులు తమ పిల్లలకు ఉన్నత చదువులు చదివించాలన్నారు. కార్యక్రమంలో అనంతపురం 48వ డివిజన్ కార్పొరేటర్ ఎం. శ్రీనివాసులు, రజక సంఘం నాయకులు మల్లికార్జున, వన్నూరుస్వామి, సురేష్, రామచంద్ర, చాకలి వన్నప్ప, లలితమ్మ, శివమ్మ, తిప్పేస్వామి, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ

బెళుగుప్ప: నట్టల నివారణ మందును మేకలు, గొర్రెలకు వేయించడం ద్వారా రోగ నిరోధక శక్తిని పెంపొందింప చేయవచ్చని కళ్యాణదుర్గం పశువైద్యశాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాసగుప్తా అన్నారు. గురువారం మండలంలోని అంకంపల్లిలో సర్పంచ్ రుద్రానంద యాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన నట్టల నివారణ పంపిణీ కార్యక్రమాన్ని మండల పశు వైద్యాధికారి రమేష్, స్థానిక ఎంపీటీసీ ప్రభావతి, నాయకులు శ్రీనివాసరెడ్డితో కలసి ఆయన ప్రారంభించారు. ఈనెల 15 నుంచి 30 వరకూ అన్ని గ్రామాల్లోనూ నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాలను నిర్వహిస్తామని జీవాల యజమానులు, సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

కార్మికులను రెగ్యులర్ చేయాలి

రాయదుర్గంటౌన్: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేసి ఉద్యోగభద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని మేనేజర్ కిశోర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు రాము, మల్లేష్, వెంకటేశులు, సిద్ద, ఆదిలక్ష్మి, వన్నూరమ్మ, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి విద్యార్థుల క్షీరాభిషేకం



బెళుగుప్ప: ఉన్నత పాఠశాలలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు



కళ్యాణదుర్గం రూరల్: జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రఫీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ పెద్దన్న, ఎంఈఓ మల్లారెడ్డి, ఎంపీడీఓ రామచంద్ర హాజరై విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. అనంతరం చిన్నారులతో కలసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సాలిబాయి, పీసీ కమిటీ చైర్‌పర్సన్ తిమ్మక్క, ఎంపీటీసీలు శకుంతలబాయి, ఈశ్వర్, వైస్ సర్పంచ్ పాతన్న, నాయకుడు నరిగన్న, ఉపాధ్యాయుడు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని చాపిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు. సర్పంచు హనుమంతప్ప, వైస్ ఎంపీపీ కాంతమ్మ, హెచ్ఎం నరసింహులు, యోగేష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి అరుణ్‌కుమార్

బెళుగుప్ప: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో ఇప్పటికే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన అభివృద్ధి పనుల నిర్మాణాలను వేగవంతం చేయాలని నియోజకవర్గ పంచాయతీరాజ్ డీఈ, మండల ప్రత్యేకాధికారి అరుణ్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెద్దన్న అధ్యక్షతన మండలంలోని పంచాయతీ రాజ్, సచివాలయ అధికారులతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలో ఎన్ఆర్ఈజీఎస్, జెడ్పీ నిధుల క్రింద సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.2.54 కోట్లు మంజూరయ్యాయన్నారు. 14 గ్రామ సచివాలయాల పరిధిలో రూ.5.6 కోట్లు, ఆర్‌బీకేలకు రూ.3 కోట్లు, వైఎస్సార్ క్లినిక్‌లకు 1.75 కోట్లు, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో 23 గ్రామాల పరిధిలో రూ.40 లక్షల పనులకు బిల్లులు సైతం మంజూరయ్యాయన్నారు . అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, బెళుగుప్ప సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప, ఎంపీడీఓ రామచంద్ర, ఎంఈఓ మల్లారెడ్డి, హౌసింగ్ ఏఈ శివారెడ్డి పీఆర్ జేఈ సుధాకర్, సచివాలయాల ఇంజినీర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్య



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ

రాయదుర్గంటౌన్: ఐదేళ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్య బోధించడంతోపాటు పౌష్టిహాకారం అందజేయనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ అన్నారు. గురువారం పట్టణంలోని సరస్వతీబస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో జన భాగీదారి కార్యక్రమం నిర్వహించారు. తల్లులకు పూర్వ ప్రాథమిక విద్య, సంపూర్ణ ఆహారంపై, చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందజేసే సేవలపై వివరించారు. మూడేళ్ల వయస్సు ఉన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించడంతోపాటు ఐదేళ్లు వయస్సున్న ప్రీ స్కూల్ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రోజా, విజేత, ఏఎన్ఎం సంతోషమ్మ, ఎంఎస్‌కే రోజా తదితరులు పాల్గొన్నారు.

'దిశ' యాప్‌పై స్పెషల్ డ్రైవ్

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరి మొబైల్‌లో దిశ యాప్ ఉండటం ద్వారా ఎంతో మేలు చేకూరుతుందని ఎస్ఐ జి.శివ తెలిపారు. గురువారం బొమ్మనహాళ్ మండలంలో దిశ యాప్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ మేరకు పలువురి మొబైళ్లలో దిశయాప్‌ను డౌన్‌లోడ్ చేయించి ప్రయోజనాలు వివరించారు. మహిళల రక్షణ కోసం దిశ యాప్ ఉపయోగపడుతుందని ఎస్ఐ అన్నారు.

'దిశా' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి

కూడేరు: బాలికలు, మహిళలు దిశా యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడు చేసుకోవాలని ఎస్ఐ సత్యనారాయణ సూచించారు. గురువారం స్థానిక కలగళ్లరోడ్డు క్రాస్‌లో దిశా యాప్ ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మొబైల్‌లో యాప్ డౌన్‌లోడ్ చేయించారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.